
ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కొండపల్లి రాజారావు

## ఎన్నికల్లో సమర్థంగా పనిచేయాలి

**అధికారులు, సిబ్బందికి సన్నాహక సమావేశంలో తహసీల్దార్**

బూర్గంపహాడ్, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కొండపల్లి రాజారావు సూచించారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, అందుకు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులు ఉంటే వారు ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల అంశాలపై వర్చించి వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవో వివేక్‌రామ్, ఎంపీవో సునీల్ శర్మ, డీటీ రాంనరేశ్ పాల్గొన్నారు.

## కరకగూడెంలో ఐసీఎంఆర్ వైద్యుల పర్యటన

కరకగూడెం, అక్టోబర్ 25: కరకగూడెం మండలం భట్టుపల్లి ఉప ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన అంగారుగూడెంనికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (పూణే) వైద్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మరికొందరి నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఇందులో 11 మందికి ప్లాస్మోడియం ఫాల్సీ ఫారం, ఒకరికి ప్లాస్మోడియం వైవాక్స్ ఉన్నట్లు గుర్తించారు. 12 మంది జ్వర పీడితులకు ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు అరుణ్‌బాబు, నాగరత్నం, జ్యోతి, కృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయుర్వేద వైద్యాధికారి కుమారస్వామి నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.


అంగారుగూడెంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఐసీఎంఆర్ వైద్యులు

## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి: ఎస్ఐ

బూర్గంపహాడ్, అక్టోబర్ 25: మారుమూల ఏజెన్సీ గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై రాజ్‌కుమార్ ఆకాంక్షించారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు మండలంలోని పలు మారుమూల గ్రామాల యువకులకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మరో ఎస్ఐ నాగభిక్షంతో వాలీబాల్ కిట్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడలతోపాటు చదువులోనూ ప్రతిభను కనబర్చాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణగా ఉంటూ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.


కిట్ అందిస్తున్న ఎస్ఐలు రాజ్‌కుమార్, నాగభిక్షం

## స్నేహితురాలి చదువుకు రూ.25 వేల ఆర్థికసాయం

బూర్గంపహాడ్, అక్టోబర్ 25: మండలంలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన పులి ప్రియవర్షిణి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో చదువు నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన స్నేహితులు మేడం లక్ష్మిరెడ్డి, ఆవుల రవీంద్రారెడ్డిలు ఆమె విద్యాభ్యాసం కోసం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం ఆమె నివాసంలో ఆమెకు అందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ దాతల ఆర్థిక సాయంతోనే కళాశాలకు వెళ్లిన ఆమె.. 461/470 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది.


ప్రియవర్షిణికి ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

# బీఆర్ఎస్‌తోనే 'పినపాక' అభివృద్ధి

- అన్ని వర్గాలకూ ఉపయోగకరంగా సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు
- బీఆర్ఎస్‌లో చేరిన తిర్లాపురం కాంగ్రెస్ ఉప సర్పంచ్


కాంగ్రెస్ ఉప సర్పంచ్ కంటెం సురేశ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్

మణుగూరు టౌన్, అక్టోబర్ 25: మణుగూరు మండలంలోని తిర్లాపురం ఉప సర్పంచ్ కంటెం సురేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మణుగూరులో బుధవారం ఆయనకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే పినపాక నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిందని అన్నారు. అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గమనించే కాంగ్రెస్‌కు చెందిన తిర్లాపురం ఉప సర్పంచ్ బీఆర్ఎస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇంకా చాలామంది నాయకులు బీఆర్ఎస్‌లోకి వస్తారని అన్నారు. అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు ఉపయోగకరంగా ఉన్నాయని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరావు, అడపా అప్పారావు, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.

# పంచాక్షరయ్యను కలిసిన తాతా మధు, డాక్టర్ తెల్లం

సారపాక, అక్టోబర్ 25: బూర్గంపహాడ్ మండలంలోని ఇరవెండిలో తాళ్లూరి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్యను ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావు కలిశారు. విజయదశమి సందర్భంగా ఇటీవల ఇరవెండిలో ఆయన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపునకు మద్దతు కావాలని, బీఆర్ఎస్ విజయానికి కృషిచేయాలని, సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాక్షరయ్య స్పందిస్తూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో మాత్రమే ఉన్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. తెల్లం గెలుపు కోసం తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. భద్రాచలం నియోజకవర్గంలో తనతో కలిసి పనిచేసిన ప్రతిఒక్కరూ తెల్లం గెలుపు కోసం కృషిచేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఇతర ప్రముఖులు బిక్కసాని శ్రీనివాసరావు, జలగం జగదీశ్, వల్లూరిపల్లి వంశీకృష్ణ, కామిరెడ్డి రామకొండారెడ్డి, గొనెల నాని, ఆడుసుమిల్లి జగదీశ్, చావా లక్ష్మీనారాయణ, పాకాలపాటి శివబాబు, తాళ్లూరి ప్రభాకర్‌రావు, తాళ్లూరి రాధాకృష్ణ, ప్రసాద్, తాళ్లూరి రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


పంచాక్షరయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం

### ఎన్నికల నిర్వహణకు..

# పకడ్బందీ ఏర్పాట్లు

- పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం
- మండలంలో ఐదు సమస్యాత్మక కేంద్రాలు: తహసీల్దార్


తహసీల్దార్ రాజారావు

సారపాక, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని బూర్గంపహాడ్ తహసీల్దార్ కొండపల్లి రాజారావు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'తో బుధవారం ఆయన మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా మండలంలో 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. మండలంలోని ఇరవెండి, మోతె పట్టీనగర్, కృష్ణసాగర్ గ్రామాల్లో 185, 186, 187, 217, 218 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు వివరించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఓటు వేసేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని, మండలంలో ఉన్న అలాంటి వారికి బీఎల్వోల ద్వారా విషయాన్ని తెలియజేస్తామని అన్నారు. అలాగే, 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 30 వరకు అవకాశం కల్పించిందని చెప్పారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలకు మండల యంత్రాంగమంతా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

# మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా

**కరకగూడెం, ఏడూళ్ల బయ్యారం పర్యటనలో భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్**


కరకగూడెంలో పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కరకగూడెం, అక్టోబర్ 25: మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ డాక్టర్ వినీత్, ఓఎస్డీ సాయిమనోహర్ కరకగూడెం పోలీసులకు సూచించారు. కరకగూడెం, గుండాల, ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్లను బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మారుమూల ప్రాంతాల ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోనేలా వారికి ధైర్యాన్ని కల్పించాలని సూచించారు. మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఏడూళ్లబయ్యారంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల కోసం మౌలిక సదుపాయాల ఏర్పాటు

మణుగూరు టౌన్, అక్టోబర్ 25: మణుగూరులోని పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మణుగూరు పాఠశాల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల చక్రాల వాహనాలు ఎక్కేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ర్యాంపును తహసీల్దార్ రాఘవరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు చెప్పారు.


ర్యాంపు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి